రతన్ టాటాకు పీవీ మెమోరియల్ అవార్డు

న్యూఢిల్లీ, మార్చి 16: టాటా సన్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటాకు మరో ప్రతిష్ఠాత్మక అవార్డు వరించింది. దాతృత్వ రంగంలో ఆయన చేసిన సేవలకుగాను పీవీ నర్సింహారావు మెమోరియల్ అవార్డుతో సత్కరించింది. ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ అవార్డును రతన్ టాటాకు అందించారు. వ్యాపార ప్రపంచంలో రతన్ టాటా చాలా కీలకమైన వ్యక్తి, దాతృత్వంలో ఆయన చేసిన కృషికి, అవిశ్రాంత ప్రయత్నాలకు గుర్తింపు లభించినట్లు అయింది. ఏటా సంక్షేమం, మానవతా కారణాల కోసం అసాధారణమైన అంకితభావాన్ని ప్రదర్శించిన వ్యక్తులకు భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్మారక పురస్కారాన్ని అందిస్తున్నారు. ఈ సారి మాత్రం టాటా సన్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటాను వరించింది. ఆయనకు వచ్చిన ఆదాయంలో సగం దాతృత్వాలకు కేటాయిస్తున్నారు. ఇందుకోసం ఏకంగా టాటా ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు కూడా. ఇలా కేటాయించిన నిధులను వైద్య, విద్య, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ సమతుల్యత కోసం వినియోగిస్తున్నారు. 86 ఏండ్ల వయస్సు కలిగిన రతన్ టాటాకు 2008 ఏడాదికిగాను పద్మ విభూషణ్, 2000కిగాను పద్మ భూషణ్ అవార్డుతో సత్కరించారు.

టెస్లాతో దేశీయ సంస్థలకు ఇబ్బందే

ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆటోమొబైల్ కంపెనీలు

న్యూఢిల్లీ, మార్చి 16: దేశీయ ఆటోమొబైల్ సంస్థలపై పిడుగుపడింది. ఇప్పుడిప్పుడే ఈవీ రంగంలోకి అడుగుపెడుతున్న దేశీయ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం షాకిచ్చింది. విదేశీ సంస్థలకు రాచబాట వేస్తూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన ఈవీ పాలసీని ప్రవేశపెట్టడంతో ఆటోమొబైల్ సంస్థలు ఆందోళనకు గురవుతున్నాయి. ముఖ్యంగా ఇటీవల ఈవీలను ప్రవేశపెట్టిన టాటా, మహీంద్రాతో పాటు ఇతర సంస్థల్లో గందరగోళం నెలకొన్నది. అంతర్జాతీయ ఈవీ దిగ్గజం టెస్లా ప్రవేశించనుండటంతో తమ ఈవీలను కొనుగోలు చేసేవారు తక్కువగా ఉంటారని ఆందోళన చెందుతున్నాయి.

దిగుమతి సుంకాన్ని తగ్గించొద్దు

దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నరేంద్ర మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన మేక్ ఇన్ ఇండియా పథకానికి తూట్లు పొడుస్తున్నది. లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో తొలిసారి అధికారంలోకి వచ్చినప్పటి ఆశయాలకు మోదీ సర్కారు తాజా విధానాలతో పంగనామాలు పెడుతున్నది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వాహనాలపై విధిస్తున్న దిగుమతి సుంకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించవద్దని ఇప్పటికే దేశీయ ఆటోమొబైల్ సంస్థలు మొర పెట్టుకున్నా కేంద్రం పెడచెవినపెట్టింది. ఏకంగా రూ.4 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెడితే దిగుమతి చేసుకునే కార్లపైన సుంకాన్ని తగ్గించనున్నట్లు శుక్రవారం ప్రకటించిన ఈవీ పాలసీలో స్పష్టంచేసింది. విదేశీ పెట్టుబడిదారుల తాకిడి నుంచి తమను ఆదుకోవాలని దేశీయ ఈవీ వాహన తయారీ సంస్థలు గగ్గొలు పెడుతున్నప్పటికీ కేంద్రం.. కేవలం టెస్లా కోసం మాత్రమే ఈవీ పాలసీని రూపొందించినట్లు విమర్శలు గుప్పుమంటున్నాయి. కానీ, డీపీఐఐటీ కార్యదర్శి సింగ్ వ్యాఖ్యలు వేరేవిధంగా ఉన్నాయి. దేశీయ ఎలక్ట్రిక్ వాహన మార్కెట్‌కు మరింత ఊతమిచ్చే విధంగా ఈవీ పాలసీని రూపొందించినట్లు, పలు అంతర్జాతీయ సంస్థలకు దిగుమతి సుంకంపై రాయితీ ఇవ్వడం వల్ల కూడా దేశీయ సంస్థలకు లాభం చేకూరనున్నదని వ్యాఖ్యానించారు. దిగుమతులను నియంత్రించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు, కానీ ప్రాంతీయ సంస్థలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడదని ఆయన చెప్పారు.

భారత్‌లో పెట్టుబడులు పెట్టడం ముఖ్యం. ఆటోమొబైల్ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి కానీ, ఇతర దేశాల్లో ఉత్పత్తైన కార్లను ఇక్కడికి తెచ్చి విక్రయించడం సరికాదు. - అనీశ్ షా, మహీంద్రా ఎండీ

8 వేల యూనిట్ల వరకు మాత్రమే

విదేశీ సంస్థలకు రాచబాట వేయడం లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టంచేస్తున్నప్పటికీ వాహన తయారీ సంస్థలు మాత్రం ఆందోళనను వ్యక్తంచేస్తున్నాయి. ప్రతియేటా 8 వేల యూనిట్లను దిగుమతి చేసుకునేందుకు అవకాశం ఇచ్చామన్నారు. ఒక్కో సంస్థ ఏటా 8 వేల యూనిట్లు అనుమతి ఉండగా, మొత్తంగా ఐదేండ్లలో 40 వేలకు మించదని ఆయన వ్యాఖ్యానించారు.

ట్రిలియన్ డాలర్లకు రియల్టీ

న్యూఢిల్లీ, మార్చి 16: దేశీయ రియల్ ఎస్టేట్ రంగం దూసుకుపోతున్నది. 2034 నాటికి దేశీయ రియల్ ఎస్టేట్ మార్కెట్ విలువ 1.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని రియల్‌ఎస్టేట్ బాడీ క్రెడాయ్ అంచనావేస్తున్నది. ఇదే క్రమంలో 2047 నాటికి 5.17 ట్రిలియన్ డాలర్లను అధిగమించనున్నదని పేర్కొంది. ప్రస్తుతం మార్కెట్ సైజు రూ.24 లక్షల కోట్లు(300 బిలియన్ డాలర్లు)గా ఉన్నదని తెలిపింది. వీటిలో రెసిడెన్షియల్ మార్కెట్ రేషియో 80 శాతంగా ఉండనుండగా, కమర్షియల్ రంగ వాటా 20 శాతమని శనివారం విడుదల చేసిన 'బిల్డింగ్ వికసిత్ భారత్' నివేదికలో పేర్కొంది. దేశీయ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న రియల్ ఎస్టేట్ రంగం వచ్చే పదేండ్లలో ఎన్నో రెట్లు పెరగనున్నదని తెలిపింది. 2033-34 ఆర్థిక సంవత్సరం నాటికి దేశ జీడీపీలో 13.8 శాతం వాటాతో 1.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటున్నదని అంచనావేసిన నివేదిక..2047 నాటికి జీడీపీలో 17.5 శాతం వాటాతో 5.17 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటున్నదని పేర్కొంది.

- గృహాల్లో రూ.45 లక్షల పై ధర కలిగిన ఇండ్ల వాటా 61 శాతం
- సరాసరిగా ప్రతియేటా గృహ స్థలాలు 11 శాతం పెరగనున్నాయి.
- 2030 నాటికి దేశీయంగా 7 కోట్ల యూనిట్ల అదనపు గృహాలకు డిమాండ్ .
- ఉద్యోగ కల్పన, దేశ ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా ఉండటం,ఆదాయం పెరగడం, బ్యాంకులు సులభంగా రుణాలు ఇస్తుండటం కూడా గృహాల విక్రయాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయి.

కన్యాకుమారి టు కశ్మీర్ ఈటో ర్యాలీ

హైదరాబాద్, మార్చి 16: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ ఈటో..భారత్‌లో తొలిసారిగా మహిళా డ్రైవర్లచేత మూడు చక్రాల వాహన ర్యాలీ హైదరాబాద్‌కు చేరుకున్నది. కన్యాకుమారి టు కశ్మీర్ చేపట్టిన ఈ ర్యాలీ ఎనిమిది రోజుల్లో వెయ్యి కిలోమీటర్లు పూర్తైనట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సిడ్బీ), ఎలక్ట్రిక్ మొబిలిటీ యాస్ ఏ సర్వీస్‌తో కలిసి ఈటో మోటర్స్ ఈ ర్యాలీని నిర్వహిస్తున్నది. దీంట్లోభాగంగా క్లీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ దేశవ్యాప్తంగా 800 ఈవీ చార్జింగ్ స్టేషన్లను నెలకొల్పింది. ఎనిమిది మంది సభ్యులు కలిగిన ఈ టీం 30 రోజుల్లో 3,333 కిలోమీటర్లు ప్రయాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నది.

అదానీకి కొత్త చిక్కులు

లంచం కేసులో అమెరికా దర్యాప్తు వేగవంతం

న్యూఢిల్లీ, మార్చి 16: హిండెన్‌బర్గ్ రిసెర్చ్ దెబ్బ నుంచి కోలుకుంటున్న అదానీ గ్రూప్‌పై మరో పిడుగు పడింది. అదానీ గ్రూప్, దాని అధినేత గౌతమ్ అదానీపై లంచం ఆరోపణల దర్యాప్తును అమెరికా వేగవంతం చేసింది. అదానీ గ్రూప్ లేదా గౌతమ్ అదానీసహా గ్రూప్‌లోని ఆయా సంస్థల ఉన్నత వర్గాలు.. ఓ ఎనర్జీ ప్రాజెక్ట్‌కు సహకరించాలని భారతీయ అధికారులకు ముడుపులు చెల్లించడంలో భాగమయ్యారా? అన్న కోణంలో అగ్రరాజ్య ప్రాసిక్యూటర్లు విచారణ జరుపుతున్నారు. అమెరికాలోని న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయం, వాషింగ్టన్‌లోని ఫ్రాడ్ యూనిట్.. ఈ దర్యాప్తును చేస్తున్నది. కాగా, దేశీయ రెన్యువబుల్ ఎనర్జీ కంపెనీ అజుర్ పవర్ గ్లోబల్‌పైనా ఇన్వెస్టిగేషన్ వర్గాలు ఓ కన్నేశాయి.

ఇక్కడైతే తేలలేదు..

అదానీ గ్రూప్ అక్రమాలపై హిండెన్‌బర్గ్ రిసెర్చ్ రిపోర్టులో వచ్చిన ఆరోపణలు నిజమేనని ఇప్పటిదాకా దేశీయ దర్యాప్తుల్లోనైతే తేలలేదు. అటు సుప్రీం కోర్టు, ఇటు మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. వేర్వేరుగా ఈ వ్యవహారంపై దర్యాప్తులు చేపట్టిన సంగతి విదితమే. మరోవైపు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు అండదండలు కూడా అదానీ గ్రూప్‌కున్నాయని, అందుకే అక్రమాలేవీ బయటకు రావడం లేదన్న వాదనలూ వినిపిస్తున్నాయి. అదానీ డీల్స్ వెనుక మోదీ కూడా ఉన్నారన్న ఆరోపణలు అప్పట్లో బలంగా వచ్చినది తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికాలో అదానీపై దర్యాప్తు వేగవంతం కావడంతో అక్కడైనా అసలు విషయాలు వెలుగులోకి వస్తాయా? అన్నది ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది.

మాకేం తెలియదు: అదానీ గ్రూప్

మరోవైపు ఈ దర్యాప్తునకు సంబంధించి మాకు ఎలాంటి సమాచారం లేదని అదానీ గ్రూప్ బ్లూంబర్గ్ న్యూస్‌కు తెలిపింది. అదానీ గ్రూప్‌తోపాటు, అజుర్ పవర్ వర్గాలూ స్పందించేందుకు నిరాకరించాయి. అమెరికా స్టాక్ మార్కెట్లలో నమోదైనా.. లేక అక్కడి ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టినా.. లేదా ఆ దేశ కంపెనీలతో జాయింట్ వెంచర్ ఉన్నా.. సదరు సంస్థలు ఏ దేశానికి చెందినవైనా అవినీతి ఆరోపణలు వస్తే వాటిపై ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ) కింద అగ్రరాజ్యం దర్యాప్తునకు దిగుతుంది. ఈ క్రమంలోనే అదానీ గ్రూప్‌లో అమెరికన్ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టారని, అందుకే భారత్‌లో జరిగిన ఈ లంచం ఆరోపణలపై విచారణ చేస్తున్నట్టు చెప్పున్నారు. దోషులని తేలితే భారీ జరిమానాలు పడే వీలున్నది. మొత్తానికి గత ఏడాది అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ రిపోర్టుతో దేశీయ స్టాక్ మార్కెట్లలో అదానీ గ్రూప్ మార్కెట్ విలువ నిలువునా కరిగిపోయినది తెలిసిందే. లక్షల కోట్లలో వాటిల్లిన ఈ నష్టాలను పూడ్చుకుని ఇప్పుడిప్పుడే పూర్వ వైభవాన్ని గౌతమ్ అదానీ సంతరించుకుంటున్నారు. ఈ క్రమంలో ఈ లంచం ఆరోపణలు మళ్లీ అదానీ సంపదను ఏ రకంగా, ఎంత మేరకు ప్రభావితం చేస్తాయోనన్నది ఊహించలేకుండా ఉన్నది.

బీపీఎల్ ఆర్‌ని పెంచిన ఎస్బీఐ

న్యూఢిల్లీ, మార్చి 16: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ).. బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు(బీపీఎల్ఆర్)ని సవరించింది. ఈ నెల 15 నుంచి అమలులోకి వచ్చేలా బీపీఎల్ఆర్‌ని 15 శాతానికి పెంచింది. కానీ, మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని యథాతథంగా ఉంచింది. బేస్ రేటుని 10.25 శాతంగా కొనసాగించింది. ఒక్కరోజు కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్ రేటు 8 శాతంగా ఉంచిన బ్యాంక్ నెల ఎంసీఎల్ఆర్‌ని 8.20 శాతంగాను, మూడు నెలల రేటును 8.2 శాతం, ఆరు నెలల ఎంసీఎల్ఆర్‌ని 8.55 శాతంగా ఉంచింది. రుణ గ్రహీతలు అత్యధికంగా తీసుకునే ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై రేటును 8.65 శాతంగా నిర్ణయించింది. అలాగే రెండేండ్ల రుణాలపై ఎంసీఎల్ఆర్ రేటును 8.75 శాతంగాను, మూడేండ్ల కాలపరిమితిపై 8.85 శాతానికి సవరించింది. ఈబీఎల్ఆర్ మారలేదు.